## వంటింటి లెక్చర్లు (6)
## కర్రలూ - పాములూ

---

ఏవండి సార్! ఇండిపెండెంట్లు, ఇండిపెండెట్లు అంటున్నారు— ఎవరండీ ఈ బాపతు సరుకు' అని మా గురూగార్ని ప్రశ్నించాను.

అప్పుడు మావారు తలగోక్కున్నారు. నాకు ఆర్డినరి హవుస్‌వైఫుకి రాష్ట్ర రాజకీయాల గురించి సింపుల్‌గా చెప్పడం ఎల్లాగా అని, ఇలా ప్రారంభించారు.

'నువ్వు బజ్జీలు తయారుచేయటానికి కూర్చున్నావు కత్తిపీట ముందేసుకుని. ఫరెగ్జాంపుల్ నువ్వే ఇందిరాగాంధీ అనుకో, కత్తిపీట ఎన్నికల సంఘం అనుకో. బజ్జీలు చెయ్యడం ఎన్నికలు, సరేనా—కాండిడేట్లు అరటి కాయలనుకో-మరి తరగాలి కదా. నైసుగా చెక్కుతీసి నీళ్ళలో ముంచి కట్టింగ్ ప్రారంభిస్తావ్. అవునా?

"అవును."

"ఎన్ని అరటికాయలు తరుగుతున్నావ్?"

"బజ్జీలకు ఎన్ని కావలిస్తే అన్నీ-"

"అంతకంటె ఎక్కువ తరగవ్—"

"తరగను"

"మరి తరగ్గా కొన్ని అరటికాయలు మిగిలిపోతాయికదా"

"మిగిలి పోవడమేవిటి? అవి రేపటికి పనికొస్తాయి."

"అగు అంత వరకూ ఆగు. ఆ మిగిలిపోయిన అరిటికాయలు ఇండి పెండెంట్లు— అనగా బజ్జీలకోసం తిరుగబడవు. ఇదేనే పొలిటిక్సు అంటేను"

"ఇందులో పోలిటిక్సు ఏం వుందండీ నా మొహం."

"నీ మొహవే వుంది?"

"బజ్జీలకు తరిగిన అరిటికాయ ముక్కలు అధికార కేండిడేట్లు అలా తరగకుండా వదిలేసిన అరిటికాయలు కానీ లేదా ముక్కలుకాని బజ్జీలలో భాగం కాదు ఇవి ఇండిపెండెంట్లు అన్నమాట-"

"అవునే భామా! ఇల్లా దగ్గిరసారా - అలా దూరంగా కూర్చుంటే నేను చెప్పే నాలుగు ముక్కలూ గాలికేపోతాయి. నీ బుర్రలో పట్టీ పేలూ చుండ్రే మిగుల్తుంది."

"చాల్లెండి. మీ బుర్రలోని రాజకీయాలూ నాబుర్రలోని పేలూనా?"

"ఈ ఇండిపెండెంట్ల గురించి అడిగావు. చెప్పనివ్వవు."

"చెప్పండి. చెప్పండి."

"వీళ్ళలో చాలామందికి ఢవరమ్ రాసుంటుంది. అయినా వీరికి తమ ఢవరం కంటె ఎదుట పార్టీ అభ్యర్థి ఢవరమయిపోతేచాలు మహదానందంగా వుంటుంది. చాలా మంది లోపాయకారీగా డబ్బు, కత్తికో అధికారానికి భయపడో తగ్గిపోతారు."

"మరి డమ్మీ కాండిడేటు అంటే ఎవరండీ?"

"అడిగావూ చెప్తాన్చెప్తాను. డమ్మీకాండేటంటే మూల విగ్రహానికి ఏ మైలయినా తగిలి కీడు కొట్టేస్తే అప్పుడు మన కాండిడేటు వుండని, ఎందుకైనా మంచిదని ఓ పొడి ముక్కను వుంచుకుంటారు తురుపుముక్క చిన్నముక్కయినా ఆట చివర్లో పనికొస్తుంది కదా—

"అల్లా చెప్పండి. మరి ఇండిపెండెంట్లు ముందే తయారవరా?"

"ఎందుకవుతారు? అధికార పార్టీ టిక్కెట్ల కోసం తిరిగి తిరిగి కాళ్ళు నొప్పులు పుట్టింతర్వాత అది రాకపోయాక ఆ పార్టీలోంచి చీలిపోయివచ్చి డిపాజిట్టు కట్టి నామినేషన్లు తగలేస్తారు. వీళ్ళని తిరుగుబాటు ఇంటిపెండెంట్లంటారు. వీళ్ళది చేటపెయ్య వ్యవహారం;

"అయినా నాకు తెలీకడుగుతాను ఇంతమందెందుకు పోటీలు పడి 287 సీట్లకు 2 వేలమంది తయారవటం?"

"మళ్ళీ మొదటికొస్తున్నావు. ప్రజాస్వామ్యం అంటే ఎన్నికలు ఎన్నికల్లో పోటీచేసి అధికార పార్టీ ముద్ర సంపాదిస్తే పంది కూడా నంది



కిందే లెక్క. అలాటి టిక్కెట్టు లేకుండా దేశసేవ చేయటానికి వాళ్ళకి ప్రాణం ఒప్పదు."

"దేశసేవేమిటి?

"మరి 387 సీట్లకి రెండువేలమంది నామినేషన్లు తగలేశారంటే అందులో 1046 మంది ఇండిపెండెంట్లను మళ్ళీ వాళ్ళలో 500 మంది తిరుగుబాటు కాంగ్రెసు నాయకులంటే మనవారిలో దేశసేవానురక్తి ఎంత గాఢంగా వ్యాపించి వుందో తెలుసుకోనవే యువతీ అలా—"

"పంచదార దేశభక్తులు, రక్షణ నిధికి చందాలిచ్చే దేశభక్తు, ఎన్నికల దేశభక్తులని దేశభక్తుల్లో మూడు రకాలున్నాయన్నమాట. వీళ్లందర్నీ ఓ పడవలో ఎక్కించి ఘాజీవిముంచేసినట్లు నట్టేట్లో ముంచేస్తే దేశం బాగుపడుతుందండీ!"

"తప్పు తప్పు అలా అనకు క్రమశిక్షణలేదను వినడానికి బావుంటుంది. మన నాటు పొలిటీషన్లందరూ చచ్చిపోయారనుకో అప్పుడు మనకి వినోదం వుండదు. తిరుగుబాటుదార్లుండరు. ఎన్నికలకటే ఓడిపోయేవాళ్ళ సంఖ్య హెచ్చుగా వుంటేనే మజాగా వుంటుంది."

"మరి మనదేశంలో యిన్ని పార్టీ లేవిటి? చక్కగా రెండో మూడో పార్టీలుంటే అందంగా వుంటుందిగాని సంతలో దుకాణాల్లాగ యిన్ని పార్టీ లేవిటీ? ఇందరు నాయకులేవిటి? వీళ్ళంతా ఏవిటి చేస్తారు?"

"పార్టీ కి నిధులు వసూలు చేస్తారు. అదృష్టం బాగుండి ఎన్నికలయి నెగ్గితే టియ్యేలు డ్రా చేస్తారు. ప్రజల్ని మోసగించటానికి ఎన్ని పార్టీలుంటే అంత మంచిది."

"మరి పార్టీ రహిత పార్టీ అంటే ఏవిటండీ?"

"వాళ్ళు పూల మొక్కలూ అవీ పీకుతారు. బంగాళాలు కార్లు మంత్రులకు జీతాలు దండగని సత్యాగ్రహం చేస్తారు. అసలు పార్టీలేఉండ కూడదని పార్టీ రహిత ప్రజాస్వామ్యమే ఏకైక లక్ష్యమని అరుస్తారు."

"ఎందుకు?"

"మమ్మల్ని గెలిపించమని—"

"మరి పీడిత ప్రజల నాయకుడు అంటే ఎవరండీ?"

"ప్రభుత్వ దరలు పెరగనిచ్చి పన్నులు వసూలు చేసి ప్రజలను పీడిస్తుంది. అలా పీడింపబడిన ప్రజల దగ్గరనుంచి ఓట్లులాగి అధికారంలోకి రావాలనుకునే వాడు పీడిత ప్రజల నాయకుడవుతాడు."

"మరి సోషలిజం అంటే అదేవిటండీ?"

"అది పామ్మంత్రం తేలు మంత్రంలాటిది"

"మంత్రం మంచిదేకదా!"

"అవును. ప్రజలకు ముందు తేళ్ళూ పాములు కరవాలికదా. ఆలా కరిచాక వేసే మంత్రం సోషలిజం అందుకని ప్రజల్ని కష్టాలనే పాముల చేత కరిపిస్తున్నారు ముందు."

"సోషలిజం ఎప్పుడు వస్తుంది?"

"ప్రజలు కరిచే పాముల్ని కర్రలతో బాది చంపిన తరువాత"

"కర్రలెవరిస్తారు?"

"కర్రలు దిగుమతీ చేయబడవు. పాముల్ని చంపడానికి కర్రలు ఎత్తాలి అనుకోగానే కర్రలు వస్తాయి."

"పొయ్యిలో కర్రలు పనికొస్తాయా?"

"ఆహా భేషుగ్గా—"